## క్లుప్తంగా

### కలెక్టరేట్ వద్ద ధర్నా రేపు

సీతానగరం: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి వేతనదారులు తరలి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు కోరారు. లచ్చయ్యపేట చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతదారులతో మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి కూలీలు వివిధ రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న పార్వతీపురం మన్యం జిల్లా కలక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమణమూర్తి పాల్గొన్నారు.

### ప్రతీ గ్రామంలో వైద్య పరీక్షలు



జమ్మిడివలసలో ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: ప్రతీ గ్రామంలో నెలకు రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని జమ్మిడివలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ నెల రెండుసార్లు నిర్వహించే వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో విత్తనాలు

పాలకొండ: రైతులకు అందుబాటులో కట్టిజనుము విత్తనాలు ఉన్నాయని ఏఓ వై.వాహిని తెలిపారు. విత్తనాలు కావాలనుకునే రైతులంతా తమ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనల మేరకు రైతులు విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు.

### వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి

గుమ్మలక్ష్మీపురం: వేసవి ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఎండలు కారణంగా రోజువారీ నమోదయ్యే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఈ క్రమంలో బయటకు వెళ్లే వారంతా ఎండ బారి నుంచి తప్పించుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైన పనులైతేనే బయటకు వెళ్లాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. వీలైతే తరచూ నిమ్మరసం, గ్లూకోజ్ నీరు తాగాలన్నారు.

### నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

పాలకొండ: నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక పట్టణంలో పలుచోట్ల చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకూడదని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, సమాజ ఆరోగ్యానికి సహకరించాలని కోరారు.

### పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు



హద్దురాళ్ల ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ: పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని ఉప తహసీల్దారు బి.బుచ్చయ్య సూచించారు. భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని వెలగవాడ, లుంబూరు, కొండాపురం గ్రామాల్లో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటును శనివారం పరిశీలించిన ఆయన రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరగాలన్నారు. దాదాపు వందేళ్ల తర్వాత జరిగే ఈ సర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు.

### రైల్వేస్టేషన్‌లో ఎస్ఈబీ సోదాలు

బొబ్బిలి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎస్ఈబీ సిబ్బంది శనివారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాల రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఈ తనిఖీలు చేస్తున్నామని ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. కొంతమంది ప్యాసింజర్ల లగేజీ బ్యాగులను చెక్ చేసి, మత్తుపదార్థాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే జోగారావు



నారన్నాయుడువలసలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదల సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని నారన్నాయుడువలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. గడప గడపకు సంక్షేమం ఫలాలు అందించి మహిళల జీవనోపాధికి, కుటుంబ సంక్షేమానికి దోహదపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. ప్రతీ ఇంటా ఆర్థిక సమస్యలు తొలగించేందుకు మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకుని అర్హులై అందని వారు ఉంటే అటువంటి వారికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో స్థానికంగా ఏవైనా మౌలిక సదుపాయాల కల్పన చేయాలన్నా వాటిని అక్కడికక్కడే పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాలలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించి వారి సమస్యలు తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, మోహన్, సూరపునాయుడు, పి.పార్వతి, గణపతి, త్రినాథరావు, సూర్యనారాయణ, టి.ప్రసాదు, కె.వెంకటరమణ, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత పార్వతీపురమే లక్ష్యం




పారిశుద్ధ్యంపై ప్రదర్శన చేస్తున్న జట్టు సభ్యులు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ రహిత పార్వతీపురమే లక్ష్యం కావాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ బోగి ఈశ్వరరావు అన్నారు. జట్టు ఆశ్రమం నిర్వాహకులు పద్మజ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో చెత్త శుద్ధి కార్యక్రమం శనివారం ప్రారంభించారు. అందులో భాగంగా పార్వతీపురం పురపాలక సంఘం కార్యాలయం నుంచి పార్వతీపురం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న పలు వీధుల్లో ప్రదర్శన చేస్తూ జట్టు ఆశ్రమ వరకు ప్లాస్టిక్ వల్ల వచ్చే నష్టాలను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ భోగి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత పార్వతీపురం కోసం జరిగే కార్యక్రమాలలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బాలకృష్ణ, కవులు, రచయితలు, పక్కి రవీంద్ర, మల్లిపురం జగదీష్, ఇంజినీర్, రఘు, గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివ కేశవరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో నో యాక్సిడెంట్ డే



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఆటోలు నడిపేటప్పుడు పరిమితికి మించి లోడ్ ఉంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడపరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ రాజారావు, కిషోర్, సంపత్, ఆటో డ్రైవర్‌లు, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.

### విశాఖపట్నానికి ఓఎంఎస్ సర్వీసులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం – విశాఖపటన్నం రూట్లలో తిరిగే ఓఎంఎస్ సర్వీసుల్లో విజయనగరం బస్సు స్టేషన్‌కు వెళ్లకుండా గొట్లాం నుండి చెల్లూరు బైపాస్ రోడ్డు మీదుగా బస్సులను నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సత్యకనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బైపాస్ సర్వీస్ ట్రిప్పులకు రిజర్వేషన్ కూడా చేయించుకోవచ్చునన్నారు. పార్వతీపురం నుండి ఉదయం 5.40, 7.15, 8.00గంటలు, మధ్యాహ్నం 1.20, 2.15, 3.15 గంటలకు బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. విశాఖపట్నం నుండి ఉదయం 6.20, 7.40, 9.00, మధ్యాహ్నం 1.20, 2.20, 3.15 గంటలకు సర్వీసులు ఉంటాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### సప్లమెంటరీ పరీక్షలకు శిక్షణ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి తప్పిన విద్యార్థులకు జూన్ నెలలో జరగబోయే అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల రావికోన, బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కొత్తవలసలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కోచింగ్‌తో పాటు వసతి సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు.

### లోక్ అదాలత్‌లో 130 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సౌజన్య

కురుపాం: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 130 కేసులు పరిష్కరించినట్టు న్యాయమూర్తి డి.సౌజన్య తెలిపారు. కురుపాం, జియ్యమ్మవలస, నీలకంఠా పురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన పలు క్రిమినల్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం.వెంకటరమణ, జి. రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులం పిలుస్తోంది

- ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం
- ప్రతిభ ఆదారంగా ప్రవేశాలు
- పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 1030 సీట్లు
- దరఖాస్తు గడువు ఈ నెల 31
- వచ్చేనెల 8న కౌన్సెలింగ్

పార్వతీపురం/సీతంపేట: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నోటిఫికేషన్ జారీ చేశారు. గిరిజన గురుకులాల్లో చేరే విద్యార్థులకు ఉచిత భోజన వసతితో పాటు వైద్యసదుపాయాలు వంటివి ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ కళాశాలల్లో సీటు లభించిందంటే కార్పొరేట్ కళాశాలల్లో సీటు లభించినట్టేనని విద్యావేత్తలు చెబుతుంటారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 8 కళాశాలలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు...

| మండలం | సీట్ల ఖాళీలు |
|---|---|
| సీతంపేట (బాలురు) | 170 |
| సీతంపేట (బాలికలు) | 140 |
| పెద్దమడి (బాలురు) | 120 |
| పి.కునాయివలస( బాలికలు) | 140 |
| కురుపాం (బాలికలు) | 80 |
| భద్రగిరి (బాలురు) | 120 |
| పి.కోనాయివలస( బాలురు) | 140 |
| భద్రగిరి (బాలికలు) | 120 |

### మెరిట్ ఆధారంగానే...

పదోతరగతిలో వచ్చే మెరిట్ మార్కులు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ప్రతీ గ్రూపుకు 40 సీట్లు కేటాయించారు. దీనిలో ఎస్టీ 36 సీట్లు, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూ ఒక్కో సీటు మొత్తం నాలుగు సీట్లు కేటాయిస్తారు. ఒకేషనల్ ఏఅండ్‌టీ 20, సీజీఏ గ్రూపులో 30 సీట్లు పూర్తిస్థాయిలో ఎస్టీలకు కేటాయించారు.

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూఆర్.గవ్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: 11-05-2023
- దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ: 31-05-2023
- మెరిట్ జాబితాప్రకటన: 05-06-2023
- కౌన్సెలింగ్ తేదీ: 08-06-2022

### మూడోతరగతి ప్రవేశానికి

ఐటీడీఏ పరిధిలోని పీటీజీ బాలికల భద్రగిరి పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి మూడోతరగతి ప్రవేశానికి (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5లోగా దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకోసం భద్రగిరి ప్రిన్సిపాల్ 93462 87567 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పాచిపెంటలోని మినీ గురుకులంలో ఒకటో తరతగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పీఓ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఈనెల 31లోగా గిరిజన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్ఎం 94414 63451 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



సీతంపేట బాలికల కళాశాల

### సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి



గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి స్థాయిలో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించడం జరుగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు విద్యార్థులకు దగ్గర్లో ఉన్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలను సంప్రదించాలి.

– విశ్వనాథం, కన్వీనర్, ప్రిన్సిపాల్, బాలుర జూనియర్ కళాశాల

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి



బలిజిపేటలో ఇంటర్ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు

బలిజిపేట: 'ప్రైవేటు కళాశాల వద్దు – ప్రభుత్వ కళాశాలే ముద్దు' అనే నినాదంతో బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపక బృందం అడ్మిషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. అందులో భాగంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు గతంలో వెళ్లి పదవ తరగతి విద్యార్థులను కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాయిన్ చేయమని కోరుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, కళాశాలలో ఉండే మౌలిక సదుపాయాల కల్పనపై వారికి వివరించడం జరిగింది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు వొకేషన్ కోర్సులు ఉన్నాయని వాటిలో ఉచితంగా జాయిన్ అవ్వాలని వారికి తెలిపారు. ఉచిత పుస్తకాల సరఫరా, అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మురగడాంలో వ్యాధి నిరోధక టీకా వేస్తున్న జగన్మోహనరావు

• డీఐఓ జగన్మోహనరావు

బలిజిపేట: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరమని డీఐఓ జగన్మోహనరావు అన్నారు. మురగడాంలో వైద్యశాఖ నిర్వహించిన పిల్లల వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన శనివారం పర్యవేక్షించారు. టీకాలను వేసేటప్పుడు కార్డులో తేదీలను, టీకా గడువు తేదీని పరిశీలించాలని సూచించారు. వేసవిరీత్యా టీకా బాక్స్‌లో శీతోష్ణస్థితి తగు విధంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారికి టీకా వేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరిరక్షణ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది, స్థానికులతో సమీక్ష జరిపి పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి సూచించారు. ఆహార నియమాలు సక్రమంగా పాటించేలా చూడాలని, పిల్లలకు తరుచుగా నీరు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణరావు, వైద్య సిబ్బంది సోనియా, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## గడప గడపకూ సంక్షేమ పథకాలు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో శనివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ప్రజల బాగోగుల కోసం ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆయన అమలు చేస్తున్న పథకాలతో ప్రతీ ఇంట్లో ఎవరో ఒకరికి లబ్ధి జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.
ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారని, వీటితో పాటు సదస్సులు, సమావేశాలు, కార్యక్రమాల్లో ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. ప్రజలకు ఆయన చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పేదలకు పూర్తి స్థాయిలో అందుతాయని చెప్పారు. దీన్ని ప్రజలంతా గుర్తించి మళ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనెల ప్రకాశమ్మ, మయూరి అప్పలనాయుడు, మరడాన సింహాచలం, వడ్డి చిన్నారావు, వడ్డి జనార్ధనరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, లెంక రత్నాకర్‌నాయుడు, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దారు ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు..

## ఉపాధి మస్తర్ల పరిశీలన



రంగంపేటలో వేతన దారుల మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారుల ఆన్‌లైన్ మస్తరు, మేట్‌ల వద్ద ఉన్న రికార్డుల్లో ఉన్న పేర్లు ప్రాప్తిగా క్షేత్ర సహాయకులు పరిశీలించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కేఎస్‌పురం, రంగంపేట గ్రామాల చెరువుల్లో వేతనదారులు చేస్తున్న మట్టి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వారికి గిట్టుబాటు వేతనం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజావసరాలకు అనుగుణంగా సాగునీటి చెరువులు, మట్టి గోర్జిలలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

### నవధాన్యాల సాగుతో నేల సారవంతం

కురుపాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమై, తద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం డివిజనల్ యాంకర్ పర్సన్ జి. అన్నపూర్ణ తెలిపారు. శనివారం మండలంలోని రస్తాకుంటుబాయి, పాడి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన విత్తనాలను పరిశీలించిన ఆమె తొలకరి జల్లులు(వర్షం)కు ముందుగా నవధాన్యాలు సాగు చేసుకుంటే నేలకు మంచిదన్నారు. నేల బాగుంటేనే పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు.